క్లుప్తంగా

ఎల్ఐసీ ఏజెంట్ల నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గం ఇదే..

తుని: ప్రజలకు జీవిత బీమా సేవలు అందించడంలో ఏజెంట్ల పాత్ర కీలకమని మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు అన్నారు. మంగళవారం స్థానిక రెడ్ కాన్వెంట్ వీధిలోని మర్చంట్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఎల్ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా తుని శాఖ జనరల్ బాడీ సమావేశం గౌరవ అధ్యక్షుడు పి.రాంబాబు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సత్యనారాయణరాజు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా ఐ.వరప్రసాద్, ఉపాధ్యక్షుడిగా టి.అప్పారావు, నీలి రాంబాబు, జీవీ సత్యనారాయణ, కార్యదర్శిగా ఎం.నాగేశ్వరరావు, కోశాధికారిగా శ్రీనివాస్ గుప్తా, సహాయ కార్యదర్శిగా బి.రామకృష్ణ, సలహాదారుడిగా ఎస్.చెంచలయ్య, డివిజన్ ఉపాధ్యక్షుడిగా పి.మరిడియ్యలు ఏకగ్రీవంగా ఎన్నుకయ్యారు.

సామూహిక హారతి కార్యక్రమం


అమ్మవారికి హారతి ఇస్తున్న మహిళలు

ఏలేశ్వరం: శ్రావణమాసం ముగింపును పురస్కరించుకుని పట్టణంలో మంగళవారం సామూహిక హారతి కార్యక్రమం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక రూపులమ్మ అమ్మవారి ఆలయంలో హారతి కార్యక్రమం చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. శ్రావణ మాసంలో ఇంటింటా పారాయణ చేసినట్టు వారు తెలిపారు. వీహెచ్‌పీ ప్రతినిధులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, ఉడతల రమణారావు, తూమురౌతు గురయ్య, సంఘ మహిళాసభ్యులు లక్ష్మీకుమారి, మల్లేశ్వరీ, ఇందిరా, పద్మజ, సూర్యకుమారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నా భూమి-నా దేశం


కిర్లంపూడిలో మట్టిని సేకరిస్తున్న నాయకులు

కిర్లంపూడి: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో మట్టిని సేకరించారు. రాంబాబు మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గ్రామాల్లో నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. మండల ఉపాధ్యక్షుడు దొడ్డ అప్పారావు, మండల మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు కాళింగి రాఘవమ్మ పలువురు ఉన్నారు.

మైక్‌సెట్ వితరణ


పరిషత్ ప్రతినిధులకు మైక్‌సెట్ అందజేస్తున్న బీజేపీ నేత వెంకటరమణ

ఏలేశ్వరం: ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్‌కు బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు గట్టిం వెంకటరమణ మంగళవారం మైక్‌సెట్ వితరణ చేశారు. పట్టణంలో పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గాప్రసాద్, కటకం కిరీటీలకు ఈ మైక్‌సెట్ అందజేశారు. కార్యక్రమంలో గొల్లపల్లి సత్యనారాయణ, జగదీష్, రెడ్డిలోవరాజు, గట్టిం సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు రొట్టెల పంపిణీ

గోకవరం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కంబాల శ్రీనివాస్ సహకారంతో మంగళవారం గర్భిణులకు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా ప్రతి వారం ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కర్రి సూరారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, వైద్యులు వనజ తదితరులు ఉన్నారు.

పిఠాపురంలో డిగ్రీ కళాశాల భవనం నిర్మించాలి

పిఠాపురం: గ్రామంలో డిగ్రీ కళాశాల భవనం నిర్మించాలని, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరహాలు, గంగా సూరిబాబు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర మంగళవారం పిఠాపురం చేరుకోగా వారు ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడారు.

నవరత్నాలతో వెలుగులు

- మంత్రి దాడిశెట్టి రాజా
- గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం


రెల్లిపేటలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాల సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలం ఎర్రకోనేరు, తేటగుంట రెల్లిపేట గ్రామాల్లో మంగళవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామస్తుల నుంచి అనూహ్య స్పందన లభించింది. మంత్రి దాడిశెట్టి రాజాకు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఇంటింటా పర్యటించిన మంత్రి రాజా మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి ఎంతెంత లబ్ధి చేకూరింది వివరించి, సంబంధిత పత్రాలను అందజేశారు. నవరత్నాలు పథకాలు అర్హులైన అన్ని కుటుంబాలకు చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. వ్యక్తిగత సమస్యలన్నీ మూడు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, లోకేష్, తునిలో యనమల రామకృష్ణుడు ఇస్తున్న తప్పుడు హామీలను నమ్మొద్దన్నారు. సంక్షేమం, అభివృద్ధి చేయడం తమకే సాధ్యమన్నారు. మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలన్నారు. ఆత్మ చైర్మన్ చోద్రాజు రాంబాబురాజు, అన్నవరం దేవస్థానం ధర్మకర్త పేరూరి బద్రినారాయణ, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు గుండుబిల్లి వెంకటరమణ, ఉప సర్పంచ్ పోతుల పెదకాపు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- ఎ.మల్లవరంలో మండలస్థాయి క్రీడలు ప్రారంభం


ఎ.మల్లవరంలో మండల స్థాయి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

రౌతులపూడి: క్రీడలతో మనిషికి మానసికోల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. ఎ.మల్లవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అండర్–14, 17 విభాగాల్లో మండల స్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గత ఏడాది రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సత్కరించారు. అనంతరం క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన వాలీబాల్, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటిన్, ఖోఖో వంటి పలు క్రీడలను, పలు అథ్లెటిక్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రీడల్లో ప్రతి విద్యార్థి పాల్గొని రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ఏఎంసీ చైర్మన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచ్ చిందాడ పెదరాజు, ఎంపీటీసీ సభ్యుడు బొడ్డు రాజు, స్థలదాత కాకి నాని, ప్రిన్సిపాల్ ప్రసాదానం, ఎంఈఓలు శ్రీనివాస్, కొండబాబులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో...


జగ్గంపేటలో జరుగుతున్న కబడ్డీ పోటీలు

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి బాలికల క్రీడా పోటీలను విద్యావేత్త, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం ప్రారంభించారు. జగ్గంపేట ఉన్నత పాఠశాల, మన్యవారిపాలెం పాఠశాలల మధ్య కబడ్డీ పోటీతో ఈ క్రీడలు ప్రారంభమయ్యాయి. మండల స్థాయి పోటీల్లో కబడ్డీ, త్రోబాల్, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటిన్, బాల్ బ్యాడ్మింటిన్ తదితర క్రీడావిభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-2 సుబ్రహ్మణ్యం, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు హసీనాబేగం, స్టాఫ్ సెక్రటరీ ఎస్.క్రిష్ణమోహన్, పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు బి.మురళీ, బి.శివ తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్సార్ ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ గంగబాబు

తొండంగి: గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభించనున్న వైఎస్సార్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్యారోగ్యశాఖ సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మంగళవారం పెరుమాళ్లపురం పంచాయతీ గడ్డిపేట పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజల ఆరోగ్య రక్షణ నిమిత్తం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. వలంటీర్లు, వైద్యారోగ్య సిబ్బంది దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంటున్న నేపథ్యంలో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదించాలని తీర్మానించారు. ఆస్పత్రిలో రోగులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, వాచ్‌మన్ ఏర్పాటు తదితర అంశాలపై తీర్మానాలు చేశారు. ఆస్పత్రి అభివృద్ధికి నిధులు విడుదలకు కృషి చేసేందుకు అన్ని అంశాలను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గాబు రాజు, వైస్ ఎంపీపీ-2 యాదాల రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు దడాల విజయ్, బద్ది నూకరాజు, అంబుజాలపు అప్పలరాజు, యాదాల కృష్ణ, ఉపసర్పంచ్ పెరుమాళ్ల లోవరాజు, యాదాల గోపి, కాలిన గంగాధర్, సంబంధిత అధికారులు, వైద్యారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

తొండంగి: రావికంపాడు అరిగెల లచ్చన్నదొర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు నిర్వహించనున్నట్టు మండల విద్యాశాఖాధికారి షేక్‌బాబ్జి తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ క్రీడల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు క్రీడల పర్యవేక్షణ కమిటీ సభ్యుడు, పీఈటీ కోడూరి నరసింహమూర్తి తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయాలి

జగ్గంపేట: ఢిల్లీలో ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న అఖిల భారత మహిళా సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ జగ్గంపేట మండలం భావవరం గ్రామంలో మహిళా సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఢిల్లీలో జరుగుతున్న 9వ జాతీయ మహాసభలలో మహిళలకు సమన్యాయం, సమానత్వం అనే నినాదంతో చర్చ జరిపి దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంపూడి రాజు, మహిళా నేతలు వెంకటలక్ష్మి, కూడే నూక రత్నం తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తుల స్వీకరణ

గోకవరం: మండలంలోని కొత్తగా పొలాలు కొనుక్కున్న పట్టాదారు పాస్ బుక్‌లు కలిగిన రైతులు వైఎస్సార్ రైతు భరోసాకి దరఖాస్తులు చేసుకోవచ్చునని ఏఓ రాజరాజేశ్వరీ మంగళవారం తెలిపారు. రైతులు తమ పాస్‌బుక్‌తో పాటు పూర్తి వివరాలు స్థానిక వీఏఏకు అందజేయాలని ఆమె తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని మల్లిశాల, వెంగాయ్యమ్మపురం గ్రామల మధ్య పంట పొలాల్లో పేకాట శిబిరంపై దాడి చేసినట్టు జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు మంగళవారం తెలిపారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.13500 స్వాధీనం చేసుకున్నామన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజల చెంతకు..


తునిలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీపీ సుధారాణి

తుని: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే గడప గడపకూ వెళ్లి కష్టసుఖాలను తెలుసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. మంగళవారం 23వ వార్డులో కౌన్సిలర్ కర్రి శ్రీదేవి ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ–మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ మహిళలను ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయా? ఇబ్బందులు ఉంటే చెబితే పరిష్కరిస్తామన్నారు. ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ


ఒమ్మంగిలో లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తుని: ఇటీవల వైఎస్సార్ పెన్షన్ కానుకలో కొత్తగా మంజూరైన పింఛన్లను మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పట్టణంలో అర్హత ఉండి పథకాలు అందకపోతే మళ్లీ నేరుగా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: ఒమ్మంగి గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను మంగళవారం 20 మందికి పంపిణీ చేశారు. ఈ పింఛన్లను వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చినబాబు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్థానిక నేత రామిశెట్టి బులిరామకృష్ణ, మామిడి నరసింహమూర్తి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

గండేపల్లి: లారీ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి లారీని అదుపుచేయడంతో ఇద్దరు విద్యార్థులకు ప్రాణం గండం తప్పి గాయాలతో బయటపడ్డారు. స్థానికులు, ప్రయాణికుల కథనం మేరకు కడియపులంకకు చెందిన కె.మణికంఠ, కె.నారాయణ మంగళవారం స్కూటీపై తాళ్లూరు వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ ప్రయాణంలో గ్రామంలోని డివైడర్ వద్ద దూడ అడ్డుగా రావడంతో దానిని ఢీకొట్టిన ఇద్దరు విద్యార్థులు రోడ్డుపై పడిపోయారు. వారి పక్క నుంచే వెళుతున్న లారీ డ్రైవర్ దీనిని గమనించి వెంటనే సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో స్కూటీ లారీ కిందపడింది. ఈ ప్రమాదంలో మణికంఠకు తీవ్రంగా, నారాయణకు స్వల్పంగాను గాయాలయ్యాయి. సంఘటన స్థలం వద్దకు చేరుకున్న రోడ్డు అంబులెన్స్ సిబ్బంది వైద్య నిమిత్తం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు.

బంద్‌లో పాల్గొమనడం దారుణం


ఆరుగుల మోషే

కోటనందూరు: దళిత వ్యతిరేకి అయిన చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టీడీపీ పిలుపునిచ్చిన బంద్‌లో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను పాల్గొమని అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చెప్పడం దారుణమని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు, మాదిగ పోరాట రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే ఆరోపించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో మంద కృష్ణ మాదిగను అండర్ గ్రౌండ్‌లో బందించినందుకా?, మాదిగలను ఎక్కడికక్కడ అరెస్టు చేసినందుకా బంద్‌లో పాల్గొమన్నారని ప్రశ్నించారు. దళితులలో ఎవరైనా పుట్టాలని అనుకుంటారా అన్న మాజీ సీఎం చంద్రబాబుకు ఎమ్మార్పీఎస్, దళిత సంఘాలు అండగా నిలవడం సిగ్గు చేటని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగపై ఎంతో గౌరవం ఉండేదని, దళిత వ్యతిరేకి చంద్రబాబు అరెస్టుకు నిరసిస్తూ చేపట్టిన బంద్‌లో పాల్గొమని ఎమ్మార్పీఎస్, దళిత సంఘాలకు పిలుపునివ్వడంతో ఆయనపై గౌరవం పోయిందన్నారు. దళితులకు ముఖ్యంగా మాదిగలకు రాజకీయంగా పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దక్కుతుందన్నారు. స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు గడచిన తరువాత మాదిగలకు ఎమ్మెల్సీ ఇచ్చి సీఎం జగన్ న్యాయం చేసారన్నారు. రాబోయే రోజుల్లో సీఎం జగన్‌కు దళితులంతా అండగా ఉండాలని మోషే పిలుపునిచ్చారు.

స్వామివారికి వెండి పానవట్టం సమర్పణ


అర్చకులకు వెండి పానవట్టం అందజేస్తున్న కిరణ్ దంపతులు

గోకవరం: స్థానిక పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయానికి వెండి పానవట్టం సమర్పించారు. రాజమహేంద్రవరానికి చెందిన వ్యాపారి సెనపతి కిరణ్ స్వామివారికి రూ.2.40 లక్షలతో రెండున్నర కిలోలతో వెండితో పానవట్టం చేయించి మంగళవారం ఆలయ అర్చకులకు అందజేశారు. దీంతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో స్వామివారి సేవకులు తుమ్మల రామకృష్ణ, ఏనుగు రాము, ఇనకోటి పెద్దలు సంగుల మణికంఠ, పలెల్ల త్రిమూర్తులు పాల్గొన్నారు.

55 లీటర్ల సారాతో ఐదుగురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక ఎస్ఈబీ పరిధిలోని ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల్లో మంగళవారం దాడులు నిర్వహించి, 55 లీటర్ల సారాతో ఐదుగురిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఏలేశ్వరం మండలం జడ్డంగి అన్నవరం గ్రామంలోని సారా స్థావరంపై దాడి చేసి, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా బట్టీ నిర్వహిస్తున్న వల్లి కొండలరావును అదుపులోకి తీసుకుని, అతని నుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కడలి శ్రీను అనే వ్యక్తి పరారయ్యాడన్నారు. రమణయ్యపేటలో ఐదు లీటర్ల సారాతో పిట్టం కొండమ్మను, కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో ఐదు లీటర్ల సారాతో పట్టెం లక్ష్మిని, తామరాడ గ్రామంలో ఐదు లీటర్ల సారాతో బావారపు రవిని అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ దాడుల్లో కాకినాడ ఇంటిలిజెన్సీ సీఐ కె.గిరిధర్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై జె.విజయ్‌కుమార్, ప్రత్తిపాడు ఎస్ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారని సీఐ అశోక్ తెలిపారు.

శిథిలావస్థలో అతిథి గృహాలు

- ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలం
- పట్టించుకోని అధికారులు


కూలిపోయిన జెడ్పీ అతిథిగృహం


శిథిలావస్థలో ఉన్న ఏలేరు అతిథిగృహం

ఏలేశ్వరం: ఒకప్పుడు రాష్ట్రస్థాయి నేతలతో పాటు ఎందరికో ఉన్నతాధికారులకు అతిథ్యమిచ్చిన అతిథిగృహాలు నేడు శిథిలావస్థకు చేరుకున్న పట్టించుకోనే నాథుడే కరువయ్యాడు. వీటి నిర్వహణపై అధికారుల తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని సుమారు 30 ఏళ్ల క్రితం జెడ్పీ అతిథిగృహం, ఏలేరు అతిథిగృహం నిర్మించారు. సుమారు ఎకర న్నర స్థలంలో జెడ్పీ అతిథిగృహం, సాయిబాబా మెట్టపై ఏలేరు అతిథిగృహం నిర్మించారు. కాగా కాలక్రమేణ వీటికి కనీస నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. జెడ్పీ అతిథిగృహం ఎప్పుడు కూలిపోతుందోనని వాడడం మానేశారు. ప్రస్తుతం పైకప్పు దెబ్బతిని వర్షం పడితే చెరువులా మారుతోంది. అలాగే సువిశాలమైన ప్రాంగణం తుప్పలు పెరిగిపోయి అధ్వానంగా మారింది. ఏలేరు అతిథిగృహం శ్లాబ్ శిథిలం కావడంతో వర్షపునీరు గోడలపై పడడంతో గోడలు బీటలు వారాయి. దీంతో ఈ భవనం కూలిపోయే స్థితికి చేరుకుంది, భవనానికి కనీసం మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు.

వీఐపీలకు నీడ కరవు

అతిథిగృహాలు అందుబాటులో లేకపోవడంతో వీఐపీలకు నీడ కరువైంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు నిలువ నీడలేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణాల బారిన అతిథిగృహం

జెడ్పీ అతిథిగృహం ఆక్రమణాల బారిన పడింది. దీనికి రెండు మార్గాలు ఉండగా ఒకదానిని మూసివేసి అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారు. అలాగే ప్రహరీని ఆనుకుని ఇళ్లు నిర్మాణం చేపట్టారు. కాగా ప్రహరీని ఆనుకుని నిర్మించిన గృహాల కింద భాగంలో పంచాయతీ వాటర్‌ట్యాంక్ పైపులు ఉన్నాయి. పైపులైన్లపైనే ఇళ్లు నిర్మించడంతో ఎప్పటికైన ఇబ్బందులేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే పూర్తిస్థాయిలో అతిథి గృహం ఆక్రమణకు గురవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆక్రమణలు తొలగించాలి



అతిథిగృహాల అక్రమణలు తొలగించాలి. ఆక్రమణలతో విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతోంది. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ స్థలం కాపాడాలి.
– కావలి శ్రీను, ఏలేశ్వరం

వైద్య సిబ్బంది స్థానికంగా ఉండాలి

సామర్లకోట: గ్రామాల్లో ఏర్పాటు చేసిన హెల్త్ సెంటర్లలో సిబ్బంది స్థానికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పీబీ దేవం సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంత్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో రెండు హెల్త్ సెంటర్లు ఉండగా ఒక సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్) మెటర్నిటీ లీవ్‌లో ఉండగా ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదన్నారు. అలాగే మరో ఎంఎల్‌హెచ్‌పీ స్థానికంగా ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ సెంటర్లలో సిబ్బంది 24 గంటలూ సక్రమంగా విధులు నిర్వహించేలా చూడాలన్నారు.

నేడు పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు సమావేశం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయ ట్రస్టు బోర్డు సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆలయ ఆవరణలో ఆలయ అభివృద్ధి పనులతో పాటు వచ్చే నెల 15 నుంచి ప్రారంభం కానున్న దేవి నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంటుంది. ఈ సమావేశానికి ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు అధ్యక్షత వహిస్తారని, సభ్యులు హాజరు కావాలన్నారు.